క్లుప్తంగా

డైనింగ్ హాల్ నిర్మాణానికి భూమిపూజ..



భూమిపూజ చేస్తున్న వెంకటేశ్వర్‌రెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో డైనింగ్ హాల్ నిర్మాణానికి మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం భూమిపూజ చేశారు. మన ఊరు మనబడి కింద డైనింగ్ హాల్ నిర్మాణానికి రూ.14.50 లక్షలు మంజూరు కాగా పనులు చేపట్టారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు శివాంజనేయులు, ఉపసర్పంచ్ శ్రీనివాస్‌గౌడ్, ఎస్ఎంసీ చైర్మన్ జగన్, నాయకులు జగన్‌నాయక్, రాజునాయక్, జావిత్, దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

కూలిన ఇళ్ల వివరాల సేకరణ



ఇళ్ల వివరాలను సేకరిస్తున్న ఆర్ఐ శరణప్ప

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలో కూలిన ఇళ్ల వివరాలను రెవెన్యూ అధికారులు సేకరిస్తున్నారు. ఆదివారం పలు కాలనీల్లో పర్యటించిన ఆర్ఐ శరణప్ప సిబ్బందితో కలిసి కూలిన ఇళ్ల వివరాలను నమోదు చేసుకున్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తానని ఆయన తెలిపారు.

మృతుడి కుటుంబానికి చేయూత



సాయం అందిస్తున్న వైద్యనాథ్

టేక్మాల్(మెదక్): అనారోగ్యంతో మృతిచెందిన జర్నలిస్టు పిండి లింగం కుటుంబానికి సామాజికవేత్త, టీఎన్జీఓ జిల్లా అధ్యక్షుడుడాక్టర్ వైద్యనాథ్ ఆర్థిక సాయం అందించారు. ఆదివారం వారి కుటుంబాన్ని పరామర్శించి, లింగం ఇద్దరి కుమారుల చదువుకు అండగా నిలుస్తానని హామీ ఇచ్చి, ఆర్థిక సాయం అందించారు. ఆయనతో కుమ్మరి ఎల్లయ్య, యాదయ్య, ప్రసాద్ ఉన్నారు.

కొనసాగిన ధర్నా



ధర్నా చేస్తున్న కార్మికులు

వెల్దుర్తి(తూప్రాన్): మాసాయిపేట గ్రామ శివారు నోవల్‌టెక్ పరిశ్రమ ఎదుట కార్మికులు ఆదివారం ధర్నా కొనసాగించారు. కార్మికులకు మాజీ సర్పంచ్ నాగరాజు, ఎమ్మార్పీఎస్ నాయకులు యాదగిరి సంఘీభావం ప్రకటించి ధర్నాలో కూర్చున్నారు. యాజమాన్యం తక్షణం స్పందించి కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. దీక్షలో పవన్, దశరథ, యాదగిరి, గ్రామస్తులు పాల్గొన్నారు.

సూచిక బోర్డు ఏర్పాటు చేయాలి



దామరంచ వద్ద వంగిపోయిన సూచిక బోర్డు

వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తి నుంచి కుకునూర్ మీదుగా మెదక్ దారిలో సూచిక బోర్డులు శిథిలావస్థకు చేరాయి. కొన్ని ప్రాంతాల్లో బోర్డులు విరిగిపోగా, మరికొన్ని చోట్ల పక్కకు వంగిపోయాయి. సంబంధిత అధికారులు స్పందించి సూచిక బోర్డులను తిరిగి ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పండ్ల పంపిణీ



దుబ్బాక: తెలంగాణ విద్యార్థి పరిషత్ (టీజీవీపీ) ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా దుబ్బాక పట్టణంలోని వంద పడకల ఆస్పత్రిలో గర్భిణులకు, రోగులకు ఆదివారం టీజీవీపీ రాష్ట్ర కార్యదర్శి ఇస్తారిగల్ల చరణ్‌తేజ ఆధ్వర్యంలో పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీజీవీపీ నాయకులు స్వామి, గణేష్, రాజేందర్, నాగరాజు, చంద్రం, వెంకటచారీ, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

వరదనీరు వృథా!

- పూడుకుపోయిన గొలుసుకట్టు కాలువ
- నిండని పెద్దచెరువు



పిచ్చిమొక్కలతో నిండిన కాల్వ



రాజన్నవాగు గుండా వెళుతున్న బ్రహ్మసముద్రం వరదనీరు

శివ్వంపేట(నర్సాపూర్): గతంలో బ్రహ్మసముద్రం చెరువు నుంచి ఎర్రచెరువు, అక్కడి నుంచి గొలుసుకట్టు కాల్వ ద్వారా శివ్వంపేటలోని పెద్దచెరువుకు వరదనీరు చేరేది. ఇప్పుడు గొలుసుకట్టు కాలువ పూర్తిగా ముళ్ల చెట్లతో మూసుకుపోయింది. ఇప్పుడు పెద్దచెరువులోకి వరద నీరు చేరడం లేదు. దొంతి కుంతలమ్మ చెరువులోకి చేరుతున్నాయి. అక్కడ నిండిందంటే హల్దీవాగులోకి వెళ్తాయి. దీంతో హల్దీవాగులోకి వెళితే నిజాంసాగర్‌కు వెళ్తాయి. 500 మీటర్ల మేర గొలుసుకట్టు కాలువ పునరుద్ధరిస్తే పెద్దచెరువుకు నీరు చేరనుంది. అయితే గ్రామంలోని చెరువులు పూర్తిగా నిండి అలుగు పారితే పంటలకు సాగునీటి సమస్య ఉండదని రైతులు చెబుతున్నారు.

నీరు మళ్లించాలి

గూడూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని బ్రహ్మసముద్రం చెరువు నాలుగు రోజుల క్రితం నిండి అలుగు పారుతోంది. గతంలో గొలుసుకట్టు ద్వారా బ్రహ్మసముద్రం చెరువు నుంచి ఎర్రచెరువులోకి అక్కడి నుంచి శివ్వంపేట పెద్ద చెరువులోకి వరద నీరు చేరేది. ప్రస్తుతం కాలువ మూసుకుపోవడంతో అలుగు పారుతున్న నీరంతా రాజన్నవాగు గుండా దొంతి కుంతలమ్మ చెరువులోకి వెళుతోంది. ఆ చెరువూ అలుగు పారుతూ నీరంతా హల్దీవాగులో చేరుతోంది. ఎర్ర చెరువు నుంచి శివ్వంపేట పెద్ద చెరువులోకి వరద నీరు మళ్లించేలా 500 మీటర్ల మేర గొలుసుకట్టు కాలువ పునరుద్ధరిస్తే నీరు వచ్చే ఆస్కారం ఉంది. శివ్వంపేట పెద్ద చెరువులోకి వరద నీరు వచ్చేందుకు అవకాశాలు తక్కువ ఉండడంతో చెరువు నిండలేదు. 7 సంవత్సరాల క్రితం భారీ వర్షాలతో నిండిన శివ్వంపేట పెద్ద చెరువుకు ఇవాళ ఆ పరిస్థితి లేదు. ఈ చెరువు కింద 300 ఎకరాల పై చిలుకు ఆయకట్టు ఉంది.

ఎత్తిపోతల ద్వారా అవకాశం

బ్రహ్మసముద్రం వరద నీరు శివ్వంపేట పెద్ద చెరువులోకి వచ్చేందుకు గొలుసుకట్టు ద్వారా ప్రస్తుతం సాధ్యం కాకపోతే 500 మీటర్ల మేర ఎత్తిపోతల ద్వారా నీటిని పంపింగ్ చేస్తే చెరువులోకి నీరు వచ్చేందుకు అవకాశం ఉంటుంది. సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిస్తా

గూడూర్ బ్రహ్మసముద్రం చెరువు నుంచి శివ్వంపేట పెద్ద చెరువులోకి వరద నీరు గొలుసుకట్టు కాలువ ద్వారా వచ్చేందుకు చర్యలు తీసుకుంటాం. ఉన్నతాధికారులకు నివేదించి సద్వినియోగమయ్యేలా చూస్తా.

– సునీత, ఏఈ, ఇరిగేషన్

కార్యకర్తలకు అండగా ఉంటాం

దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావు



సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావు

చేగుంట(తూప్రాన్): బీజేపీ కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానని ఎమ్మెల్యే రఘునందన్‌రావు అన్నారు. ఆదివారం చేగుంటలో బీజేపీ నాయకుడు చంద్రమౌళి ప్రథమ వర్ధంతిలో పాల్గొని చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రమౌళి కుటుంబీకులకు అండగా ఉంటానని, అవసరం ఉంటే తనను సంప్రదించాలన్నారు. అనంతరం గ్రామానికి చెందిన పుల్లబోయిన శ్రీనివాస్‌కు మంజూరైన రూ.36వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును అందించారు. ఆయనతో బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్, మాజీ సర్పంచులు బాల్‌చందర్, రఘువీర్‌రావు, చంద్రశేఖర్, హరిశంకర్, సంతోష్‌రెడ్డి, నర్సింలు, సాయిరాజ్ తదితరులు ఉన్నారు.

బీజేపీలోకి ఆహ్వానం



విజయ్ కుమార్‌ను సన్మానిస్తున్న నాయకులు

నిజాంపేట(మెదక్): నిజాంపేట జెడ్పీటీసీ పంజా విజయ్ కుమార్‌కు ఆ పార్టీ నేతలు బీజేపీలోకి ఆహ్వానించారు. బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్, మండలాల నాయకులు ఆదివారం ఆయనను కలిసి సన్మానించారు. బీజేపీలో చేరి బీఆర్ఎస్ వైఫల్యాలపై పోరాడాలని పిలుపునిచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, రామాయంపేట పట్టణ అధ్యక్షుడు శంకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి నరేష్ మహంకాళి, చంద్రశేఖర్, కుమార్, ప్రశాంత్ గౌడ్, నాగరాజు, దయనంద రెడ్డి, పోచమ్మల శ్రీనివాస్, చింతల శేఖర్, రెడ్డి నరేష్, రమేష్, రాజేష్, జాల పోచయ్య, జీపీ స్వామి తదితరులు పాల్గొన్నారు.

పేదలకు అండగా నిలిచేందుకే..



బాధితులకు డిపాజిట్ పత్రాలు అందిస్తున్న మైనంపల్లి రోహిత్

చిన్నశంకరంపేట(మెదక్): పేదలకు అండగా నిలిచేందుకే మైనంపల్లి సోషల్ సర్వీస్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు ఎంఎస్ఎస్ఓ చైర్మన్ మైనంపల్లి రోహిత్ తెలిపారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. చందంపేటలో ఇటీవల మృతిచెందిన స్వామి ఇద్దరు ఆడపిల్లల పేర రూ.15వేల ఫిక్స్‌డ్ డిపాజిట్ చేయిస్తానని తెలిపారు. రుద్రారం సర్పంచ్ లక్ష్మణ్ కుటుంబాన్ని, కొర్విపల్లిలో మృతుడు నర్సింహులు కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. ఆయనతో సర్పంచ్ రాజిరెడ్డి, మాజీ సర్పంచ్ రంగారావు, మాజీ ఎంపీపీ అరుణ, మనోజ్, స్వామిరాజ్, మేడి గణేష్, తదితరులు ఉన్నారు. శేరిపల్లి గ్రామంలో తల్లి, తండ్రిని కోల్పోయిన బాలికలకు రూ.25వేల చొప్పున ఫిక్స్‌డ్ డిపాజిట్ చేసి బాండ్స్‌ను అందించారు. ఆయనతో సర్పంచ్ చెప్యాల మల్లేశం, వార్డు సభ్యులు ఉన్నారు. చందంపేటకు వెళుతూ.. శివారులో పంట పొలం వద్ద ఆగి కొద్దిసేపు ట్రాక్టర్‌తో దుక్కి దున్నాడు.

‘ఎంపీ ఎన్ని నిధులు తెచ్చారో చెప్పాలి’



మాట్లాడుతున్న చింతా సంతోష్

చేగుంట(తూప్రాన్): ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చేగుంటకు ఎన్ని నిధులు తెచ్చారో ప్రజలకు చెప్పాలని మెదక్ పార్లమెంట్ బీజేపీ జాయింట్ కన్వీనర్ చింతా సంతోష్ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్న ఎమ్మెల్యే రఘునందన్‌రావుపై ఎంపీ ప్రభాకర్‌రెడ్డి అనవసర వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎంపీగా గెలిచిన నాటి నుంచి తొమ్మిదేళ్లలో చేసిన అభివృద్ధి పనులు చూపించాలన్నారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూపాల్, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు ఎల్లారెడ్డి, మాజీ సర్పంచులు బాల్‌చందర్, రఘువీర్‌రావు, నియోజకవర్గ కోకన్వీనర్ గోవింద్, నర్సింలు, చంద్రశేఖర్, సంతోష్‌రెడ్డి పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చేగుంట(తూప్రాన్): మండలంలోని వల్లభాపూర్ దర్మచెరువు మత్తడిని ధ్వంసం చేసిన దుండగులపై చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు డిమాండ్ చేశారు. గుర్తుతెలియని వ్యక్తులు వారం రోజుల్లో చెరువు మత్తడిని మూడు సార్లు ధ్వంసం చేశారని, దీంతో నీరంతా వృథాగా పోయిందన్నారు. రెవెన్యూ అధికారులు, పోలీసులకు సమాచారం ఇచ్చినా స్పందన లేదని వాపోయారు.

నల్లపోచమ్మదేవి ఆలయానికి భక్తుల తాకిడి



అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కౌడిపల్లి(నర్సాపూర్): కౌడిపల్లి మండలం తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మను దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ ఈఓ మోహన్‌రెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆలయ పూజారులు శివప్ప, రాజేశ్ అమ్మవారికి ఉదయం పంచామృతాలతో అమ్మకు అభిషేకాలు, పూజలు చేశారు. అనంతరం భక్తులు అమ్మని దర్శించుకొని మొక్కులు తీర్చారు. వాహనాలకు సైతం పూజల చేయించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా సిబ్బంది వెంకట్‌రెడ్డి, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.



చాముండేశ్వరీ ఆలయంలో అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

అమ్మవార్లకు పూజలు

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరి అమ్మవారితోపాటు, గర్భగుడికి ఎదురుగా ఉన్న బ్రహ్మి, కాళి, వైష్ణవి అమ్మవార్లకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. ఆదివారం మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలిసిన చాముండేశ్వరి ఆలయంలో అమ్మవార్లను భక్తులు దర్శించుకున్నారు. అనంతరం వారు ప్రదక్షిణలు, ఓడిబియ్యంతో మొక్కులు తీర్చారు. అర్చకులు అమ్మకు కుంకుమార్చన నిర్వహించి, భక్తులకు తీర్థ, ప్రసాదాలు వితరణ చేశారు.

పాఠశాల ఆవరణలో మద్యం బాటిళ్లు



పాఠశాల ఆవరణలో మద్యం బాటిళ్లు

టేక్మాల్(మెదక్): దేవాలయాలంటి పాఠశాలలు మందుబాబుల అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. టేక్మాల్ మండల కేంద్రంలో ఉన్నత పాఠశాల ఆవరణలో గుర్తుతెలియని వ్యక్తులు మద్యం సేవించి బాటిళ్లను అక్కడే పడేశారు. ఖాళీ మద్యం సీసాలు, సిగరెట్ డబ్బాలు, గుట్కాప్యాకెట్ల కవర్లు పడేయడంతో పాఠశాల ఆవరణం అపరిశుభ్రంగా మారుతోందని, సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

అనుమతి లేకుండా విధులకు డుమ్మా



తాళం వేసి ఉన్న అల్లాదుర్గం పీహెచ్‌సీ

అల్లాదుర్గం(మెదక్): మండల కేంద్రాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్య సేవలు అందించే వైద్య సిబ్బంది విధులకు ఎగనామం పెట్టారు. పెడుతున్నారు. ప్రతీ ఆదివారం ఉదయం 9 నుంచి 12 గంటల వరకు షిఫ్ట్ పద్ధతిలో స్టాఫ్ నర్సు, ఏఎన్ఎంలు విధులు నిర్వర్తించాల్సి ఉండగా, అల్లాదుర్గం పీహెచ్‌సీలో సయమం ఉదయం 11 దాటినా ఎవరూ రాకపోవడంతో పీహెచ్‌సీకి తాళం వేసి ఉంది. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతోనే సిబ్బంది ఇష్టారీతిన వ్యవహరిస్తున్నారని అసెంబ్లీ నియోజకవర్గ సాధన సమితి అధ్యక్షుడు బ్రహ్మం ఆరోపించారు. ఈ విషయంపై ఆరోగ్య కేంద్రం డాక్టర్ అశ్విని వివరణ కోరగా.. ముందస్తు అనుమతి లేకుండా సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారని, వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు.

ర్యాలీని విజయవంతం చేయాలి

నాయీబ్రాహ్మణుల సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామినాయి

కౌడిపల్లి(నర్సాపూర్): నాయీబ్రాహ్మణులపై కేంద్రం ప్రభుత్వం అనుసరిస్తున్న వ్యతిరేక విధానాలకు నిరసనగా ఆగస్టు 1న మెదక్‌లో నిర్వహించే ర్యాలీకి నాయీబ్రాహ్మణుల అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని సంఘం జిల్లా అధ్యక్షుడు స్వామినాయి తెలిపారు. ఆదివారం మండలంలోని ధర్మాసాగర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, నాయీబ్రాహ్మణులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం ఈ వృత్తిని కార్పొరేట్ కంపెనీలకు అప్పజెప్పేందుకు చూస్తోందన్నారు. ఆగస్టు 1న మెదక్ డిపో బస్టాండ్ నుంచి కలెక్టరేట్ వరకు నిర్వహించే ర్యాలీలో అధిక సంఖ్యలో పాల్గొని, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతులు



మరమ్మతు చేస్తున్న సిబ్బంది

శివ్వంపేట(నర్సాపూర్): మిషన్ భగీరథ నీటి సరఫరాకు సంబంధించిన పైప్‌లైన్‌కు ఆదివారం మరమ్మతులు చేపట్టారు. మండల పరిధిలోని బోజ్యతండాకు 5 రోజుల నుంచి భగీరథ నీరు రాకపోవడంతో పంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తున్నారు. భగీరథ పైప్‌లైన్ పలుచోట్ల పగిలిపోయిందని మరమ్మతులు చేస్తున్నట్లు డీఈ ప్రవీణ్ చెప్పారు. సోమవారం తండాకు నీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

నివాళి



నివాళి అర్పిస్తున్న ఎంపీ ప్రభాకర్‌రెడ్డి

చేగుంట(తూప్రాన్): గుండెపోటుతో మృతి చెందిన మండలం మక్కరాజీపేటకు చెందిన బబ్బూ ఉర్‌రహిమాన్ పటేల్ అంత్యక్రియల్లో ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి హాజరై నివాళి అర్పించారు. ఆయనతో సర్పంచ్ శ్రీనివాస్, జెడ్పీటీసీ ముదాం శ్రీనివాస్, విశ్వేశ్వర్‌రావు, మైనార్టీ మండల అధ్యక్షుడు అలీం తదితరులు ఉన్నారు.

బాధ్యతల స్వీకరణ

చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేట ఎస్ఐగా నారాయణ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఇంత కాలం ఇక్కడ పనిచేసిన ఎస్ఐ సుభాష్‌గౌడ్ సిద్దిపేట జిల్లా చిన్నకోడూర్‌కు బదిలీపై వెళ్లగా, సిద్దిపేట జిల్లా మద్దూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వర్తించిన నారాయణ ఇక్కడకు బదిలీపై వచ్చారు.

చేగుంట ఎస్ఐగా హరీశ్

చేగుంట(తూప్రాన్): చేగుంట ఎస్ఐగా హరీశ్ ఆదివారం బాధ్యలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ప్రకాశ్‌గౌడ్‌కు సిద్దిపేట జిల్లా నంగునూర్‌కు బదిలీ అయ్యారు.

మెదక్‌రూరల్ ఎస్ఐగా సద్ది అమర్

హవేళీఘనపూర్: మెదక్‌రూరల్ ఎస్ఐగా ఎస్ఐ సద్దిఅమర్ ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేసిన మోహన్‌రెడ్డి సిద్దిపేట జిల్లా రాజగోపాల్‌పేటకు బదిలీ కాగా, ఆయన స్థానంలో సిద్దిపేట టూటౌన్ పోలీస్‌స్టేషన్ పని చేసిన ఎస్ఐ సద్దిఅమర్ ఇక్కడకు బదిలీ అయ్యారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

చేగుంట(తూప్రాన్): మండలంలోని పలు గ్రామాల్లో ప్రజాహిత ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మామిడి మోహన్‌రెడ్డి బాధిత కుటుంబాలను పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. మక్కరాజీపేటలో అనారోగ్యంతో బాధ పడుతున్న నర్సింహారెడ్డిని, మృతురాలు రేణుక కుటుంబీకులను, చందాయిపేటలో సౌజన్య, చిన్నమల్లయ్య, పోతాన్‌పల్లిలో అంతమ్మ, నర్సింలు కుటుంబాన్ని పరామర్శించారు. ఆయనతో సర్పంచు శ్రీనివాస్, నాయకులు శంకర్‌గౌడ్, విశ్వేశ్వర్‌రావు, యాదవరెడ్డి, జింక శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ **రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలి**

శివ్వంపేట(నర్సాపూర్): ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని పీఏసీఎస్ చైర్మన్ చింతల వెంకట్‌రామిరెడ్డి, మండల వ్యవసాయ అధికారి లావణ్య ఆదివారం తెలిపారు. రైతుబీమాకు తుదిగడువు ఆగస్టు 5వ తేదీ అని, ఈ అవకాశం రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కొత్త పట్టాదారు పాస్‌పుస్తకం, ఆధార్‌కార్డు, నామినీ ఆధార్‌కార్డు జిరాక్స్ పత్రాలతో వ్యవసాయ కార్యాలయంలో నమోదు చేసుకోవాలని సూచించారు.

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలో అర్హులైన రైతులు రైతుబీమాకు దరఖాస్తు చేసుకోవాలని ఇన్‌చార్జ్ ఏఓ రాజేష్‌కుమార్ తెలిపారు. జూన్ 16 వరకు కొత్త పట్టాపాస్‌బుక్ వచ్చిన రైతులు ఆధార్, పట్టాపాస్‌బుక్, నామినీ ఆధార్ జిరాక్స్ కాపీలను వ్యవసాయ కార్యాలయంలో ఆగస్టు 5వ తేదీలోగా అందజేయాలన్నారు.

◆ **అన్నదానం**



అన్నదానం చేస్తున్న క్లబ్ ప్రతినిధులు

నర్సాపూర్: లయన్స్ క్లబ్ ఆఫ్ నర్సాపూర్ స్నేహబంధు ఆధ్వర్యంలో ఆదివారం బస్టాండ్ సమీపంలో అన్నదానం చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ డాక్టర్ బాబూరావు పుట్టిన రోజును పురస్కరించుకొని స్థానిక క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించామని క్లబ్ ప్రతినిధులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ప్రతినిధులు ఆంజనేయులుగౌడ్, నర్సింహ్మారెడ్డి, అశోక్ కుమార్, శ్రీకాంత్, జైపాల్, సంజీవ, మాణిక్యం గౌడ్, వెంకటస్వామిగౌడ్, సుధాకర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

అల్లాదుర్గం(మెదక్): పట్టణంలోని ఐబీ చౌరస్తాలో ఆదివారం లైయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. క్లబ్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ బాబూరావు జన్మదినం సందర్భంగా పేదలకు అన్నదానం చేసి, ఓ పాఠశాలలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు బ్రహ్మం, సాంబశివుడు, శంకర్, నాగరాజు, సాయిలు పాల్గొన్నారు.

రామాయంపేట(మెదక్): రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో ఆదివారం లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో జోన్ చైర్మన్ ఐరేని రవీందర్ గౌడ్, క్లబ్ అధ్యక్షుడు తమ్మలి రమేష్, కార్యదర్శి కిషన్ రావు, కోశాధికారి గంగారం, సభ్యులు దామోదర్ రావు, కందిమల్ల శ్రీనివాసరావు, బాలరాజు, సతీష్ రావు, బాదె బాలరాజు మరియు ఇతరులు పాల్గొన్నారు.

రేగోడ్(మెదక్): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేగోడ్‌లో ఆదివారం అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో క్లబ్ చైర్మన్ గంజి సంగమేశ్వర్, సెక్రటరీ చోటుమియా, సభ్యులు గాండ్ల నర్సింలు, రాచప్ప, సంగ్యా నాయక్, లక్ష్మణ్‌రావు పాల్గొన్నారు.

◆ **సన్మానం**

వెల్దుర్తి(తూప్రాన్): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జీవిత చరిత్ర రచించిన ఇమ్మన్నగారి కృష్ణాగౌడ్‌ను ఆదివారం వెల్దుర్తిలోని ఎల్లమ్మ ఆలయంలో గౌడ సంఘం ప్రతినిధులు సన్మానించారు. సాహితి కళా సమితి అవార్డు అందుకున్న వెంకటయ్యగౌడ్‌ను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సుధాకర్‌గౌడ్, సొసైటీ డైరెక్టర్ కృష్ణాగౌడ్, శివ్వాగౌడ్, శంకరయ్యగౌడ్, రమేశ్‌గౌడ్, ముత్తాగౌడ్, అశోక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

◆ **ఆర్థిక సాయం**

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలో వర్షాలతో ఇళ్లు కూలిపోయిన బాధితులను ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోతరాజ్ రమణ పరామర్శించారు. ఖాజాపూర్, టీ.మాందాపూర్ గ్రామాల్లో కూలిన ఇళ్లను పరిశీలించి బాధిత కుటుంబాలకు కంటారెడ్డి తిరుపతిరెడ్డి ట్రస్ట్ ద్వారా రూ.5వేల చొప్పున సాయం అందించారు. ఆయనతో నాయకులు అక్బర్, యాదగిరి, మల్లయ్య, బాలయ్య, శ్యామయ్య తదితరులు ఉన్నారు.

◆ **కొనసాగుతున్న సమ్మె**

మనోహరాబాద్(తూప్రాన్): సమస్యల పరిష్కారం పంచాయతీ కార్మికులు చేపట్టిన సమ్మె కొనసాగుతోంది. ఆదివారం మండల కేంద్రంలో మండల నోటికి, చేతులకు తాళం వేసి వినూత్నంగా నిరసన తెలిపారు. పంచాయతీ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి ఆసిఫ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం స్పందించే వరకు సమ్మె కొనసాగిస్తామని స్పష్టం చేశారు. సమ్మెలో పంచాయతీ కార్మికులు, నాయకులు కర్రె వీరేష్, రాములు, స్వామి తదితరులున్నారు.